www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 25 మే 2025
5
పశ్చిమ గోదావరి

ఉదయం వర్షం.. మధ్యాహ్నం ఎండ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజా జీవన ఆటంకం ఏర్పడింది. ఆదివారం నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందు వర్షం ఏమిటని పలువురు చర్చించుకున్నారు. అయితే ఉదయం 10 గంటల నుంచి ఎండ ప్రారంభమై [illegible]. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే రోహిణి కార్తె ప్రభావం ఒక రోజు ముందుగానే కన్పించిందని పలువురు వ్యాఖ్యానించారు.



పాలకొల్లులో రోడ్లపై నిలిచిన వర్షపునీరు

ఉచితానికి వసూళ్లు..!

- ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఫిర్యాదుల వెల్లువ
- ఐవిఆర్ఎస్ కాల్స్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితుల ఆవేదన
- ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అదే తంతు
- ఏలూరు సమీపంలోని అతిపెద్ద ప్రయివేటు ఆసుపత్రిపై 42 ఫిర్యాదులు
- ఏలూరు సర్వజన ఆసుపత్రిపై 35 ఫిర్యాదులు, మొత్తం 30 ఆసుపత్రులపై ఫిర్యాదులు
- 'పశ్చిమ'లోనూ రోజుకు మూడు నుంచి ఐదు వరకూ ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రోగుల పట్ల కనికరం లేదు.. అయ్యో పాపం అనే జాలి లేదు. ఉచితంగా అందించాల్సిన వైద్యానికి సైతం పైసలు వసూలు చేస్తూ పేద రోగుల పట్ల ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) నెట్‌వర్క్ ఆసుపత్రులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా తయారైంది. ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆడిట్ అధికారులు నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ సర్వేల్లో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు పెద్దసంఖ్యలో ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి ఉంది. వీటిలో ప్రయివేటు ఆసుపత్రులతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులు ఉండటం గమనార్హం. ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఏలూరు సమీపంలో అతి పెద్దదిగా పేరొందిన ఆసుపత్రిపై ఏకంగా గడిచిన 23 రోజుల్లో 42 ఫిర్యాదులు వచ్చాయి. ఏలూరు నడిబొడ్డున ఆసుపత్రిపై ఐదు ఫిర్యాదులు నమోదయ్యాయి. మిగిలిన ప్రయివేటు ఆసుపత్రులపైనా ఒకటి నుంచి 13 వరకూ ఐవిఆర్ఎస్ కాల్స్‌లో బాధితులు ఫిర్యాదు చేసిన పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో మొత్తం 30 ఆసుపత్రులపై 165 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిపైనా 35 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులపై రోజుకు మూడు నుంచి ఐదు ఫిర్యాదులు వరకూ వస్తున్నాయి. అంటే ఆ జిల్లాలోనూ నెలకు దాదాపు వందకుపైగా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలుస్తోంది. రోగులు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతుండగా వైద్య సేవల్లో ఇబ్బంది పెడతారనే భయంతో

ఎన్నిసార్లు అడిగినా ఆరోగ్యమిత్రల వద్ద అంతా బాగానే ఉందని బంధువులు, కుటుంబీకులు చెబుతున్న పరిస్థితి కన్పిస్తోంది. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్‌లో మాత్రం ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆసుపత్రుల్లో తాము పడుతున్న బాధలు చెప్పుకొని రోగులు ఘొల్లుమంటున్నారు.

ఉచితంలోనూ ఇలా దోచేస్తారు..

గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీగా, ప్రస్తుతం ఎన్‌టిఆర్ వైద్యసేవగా కొనసాగుతున్న పథకంలో దాదాపు మూడు వేలకుపైగా రోగాలకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నెలకు రూ.నాలుగు కోట్లు వరకూ ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవా ద్వారా ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తోంది.

ఏలూరు జిల్లాలో 33 ప్రయివేటు, 11 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవలు అందుతున్నాయి. పశ్చిమలో 30 ప్రయివేటు ఆసుపత్రులు, ఎనిమిది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో చికిత్స చేయించుకునే రోగి నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయడానికి వీలులేదు. కానీ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో రోగులు చేరుతున్నప్పటికీ డబ్బుల వసూళ్లు మాత్రం కొనసాగుతూనే ఉంది. రోగులు చేరిన వెంటనే ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఇచ్చే సొమ్ము సరిపోదు.. అదనంగా ఖర్చవుతోందని, ఇవ్వగలిగితే వైద్యం అందిస్తాం.. లేదంటే వేరే ఆసుపత్రికి వెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. ఆర్థోపెడిక్, న్యూరో, కిడ్నీ వంటి అనేక అత్యవసర కేసుల్లో ఆసుపత్రి యాజమాన్యాలు ఈ విధంగా బెదిరించి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఆర్థోపెడిక్ రోగులకు నాణ్యమైన రాడ్లు వేస్తామని డబ్బులు వసూలు చేయడం జరుగుతోంది. అంతేకాకుండా రోగి ఆసుపత్రిలో చేరగానే పరీక్షలు, అత్యవసర వైద్యం పేరుతో కనీసంగా రూ. 30 వేల నుంచి రూ.50 వేల వరకూ పిండేస్తున్నారు. తర్వాత ఎన్‌టిఆర్ వైద్యసేవలో నమోదు చేసి మరో రకంగా డబ్బు గుంజుతున్నారు. రోగి ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ సమయంలో బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రుల యాజమాన్యాల బెదిరింపులకు తలొగ్గాల్సిన పరిస్థితి ఉంటోంది. దీంతో ప్రభుత్వం అందించే ఉచిత వైద్యంపై జనానికి నమ్మకం లేని పరిస్థితి ఉంటోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులపై కనీస చర్యలు తీసుకోని దుస్థితి నెలకొంది.

ఫిర్యాదులొచ్చిన ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీచేశాం

ఐ.రాజేష్, ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్, ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఐవిఆర్ఎస్ కాల్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై ఆయా ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఆసుపత్రుల నుంచి వివరణలు వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌ను..

3వ కాంటూరుకు కుదించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ఇంటింటికీ రేషన్ సరఫరా రద్దు సరికాదు

జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - నరసాపురం

కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌ను మూడో కాంటూరుకు కుదించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి బలరాం మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో ఎకో సెన్సిటివ్ జోన్‌ను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీంతో పూర్వ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు వంద గ్రామాలు, 15 మండలాలపై ప్రభావం పడనుందన్నారు. లక్షలాది మంది ప్రజలు అనేక విధాలుగా నష్టపోతారన్నారు. ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లాలో ఆకివీడు, ఉండి, కాళ్ల, గణపవరం, పెంటపాడు వంటి మండలాల్లో సుమారు 40 గ్రామాల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. గతంలో అసెంబ్లీలో హామీ ఇచ్చిన విధంగా కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌ను మూడో కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. అయితే ఆ హామీకి విరుద్ధంగా ఎకో సెన్సిటివ్ జోన్‌ను పదో కాంటూరుకు చేర్చుతామని, 10 కిలోమీటర్లు పెంచుతామని అంటున్నారన్నారు. దీనివల్ల కొల్లేరు ప్రజలు, మత్స్యకారులు, సొసైటీలు, జిరాయితీదారులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకో సెన్సిటివ్ జోన్‌ను తక్షణం మూడో కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన చర్యలను ఉపసంహరించుకోకపోతే ప్రజలందరినీ ఐక్యం చేసి ఉద్యమిస్తామని బలరాం హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంటు అమ్మకం తక్షణం ఆపాలని బలరాం డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రాణత్యాగాలతో పోరాడి సాధించుకున్న అతి పెద్ద ప్రభుత్వ రంగ పరిశ్రమ అన్నారు. ఒకవైపు వేల కోట్ల రూపాయలు ప్యాకేజీ ప్రకటించామని చెబుతూనే మరోవైపు కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులను అక్రమంగా తొలగించడం, ఖాళీలను భర్తీ చేయకపోవడం, సొంత బొగ్గు గనులను కేటాయించకపోవడం, పోర్టుకు అనుమతి ఇవ్వకపోవడం, నిధులు కేటాయించకపోవడం అంటే ఆచరణలో అన్ని విధాలా విశాఖ ఉక్కును అమ్మడానికి ప్రయత్నించడమేనని అన్నారు. విశాఖ ఉక్కును ప్రజలందరూ ఐక్యంగా పోరాడి కాపాడుకోవాలని బలరాం పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసరాల పంపిణీలో ఎండియు వ్యవస్థను రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీంతోపాటు రేషన్ షాపుల వద్ద కూడా సరుకుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజాపంపిణీ నిర్వహణలో లోపాలు సరిదిద్ది, ఎండియు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని, అవినీతికి తావు లేకుండా ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కేతా పద్మజ, ముచ్చర్ల త్రిమూర్తులు, మామిడిశెట్టి రామాంజనేయులు, గొర్ల రామకృష్ణ, ధనికొండ శ్రీనివాస్, సూర్నీడు వెంకటేశ్వరరావు, కానేటి బాలరాజు, కామన మునిస్వామి, కె.క్రాంతిబాబు, శేషపు అశ్రియ్య, ఇంజేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బలరాం

సమస్యల పరిష్కారం సంతృప్తికరంగా ఉండాలి

రాష్ట్ర చీఫ్ గ్రీవెన్స్ అధికారి చిన్నారావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం ప్రజలలో సంతృప్తికరంగా ఉండాలని రాష్ట్ర చీఫ్ గ్రీవెన్స్ అధికారి సిహెచ్.చిన్నారావు అన్నారు. ప్రజల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్, ప్రజాసమస్యల పరిష్కార వేదిక పోర్టల్‌లో ప్రజా సమస్యల పరిష్కారం చేసిన మార్పులు తదితర అంశాలపై జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో శనివారం అమరావతి సిఎంఒ కార్యాలయం నుండి రాష్ట్ర చీఫ్ గ్రీవెన్స్ అధికారి సిహెచ్.చిన్నారావు జూమ్ ద్వారా శిక్షణతో పాటు, సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో పాటు డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అడిషనల్ ఎస్‌పి భీమారావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూమ్ సమావేశంలో పాల్గొన్న జెసి, అధికారులు

పదవి కోల్పోయిన ఎల్‌ఎన్‌పురం ఉపసర్పంచి

భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - కాళ్ల

లక్ష్మీనరసింహపురం(ఎల్‌ఎన్ పురం) గ్రామపంచాయతీ ఉపసర్పంచి అవిశ్వాస తీర్మానంపై భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రస్తుత ఉపసర్పంచి అవిశ్వాస తీర్మానం కోరుతూ పలువురు వార్డు మెంబర్లు ఇచ్చిన ఫారం-04పై చర్చించారు. 10 మంది వార్డు సభ్యులకు గాను ఏడుగురు ఉపసర్పంచి శ్రీనివాస్‌కి వ్యతిరేకంగా ఓటువేశారు. దీంతో ఉపసర్పంచి తన పదవిని కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. ఈ సమావేశానికి సర్పంచి తానింకి నాగరాజు, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ బాలాజీ వెంకటరమణ, ఎంపిడిఒ జి.స్వాతి, గ్రామ కార్యదర్శి కె.కమల, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసరాల పంపిణీ

65 ఏళ్లు పైబడినవారు, వికలాంగులకు ఇంటివద్దే రేషన్

నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్లపై చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో జూన్ 1వ తేదీ నుంచి అన్నీ రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ఉన్న 1052 రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. భీమవరంలో రేషన్ డీలర్ల సంఘాలతో శనివారం సమావేశాన్ని ఏర్పాటుచేసి రేషన్ పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు, తీసుకోవలసిన చర్యలపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి దిశ నిర్దేశం చేసి మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ దుఖాణాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రజా ప్రతినిధులతో రేషన్ షాప్ వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వికలాంగులు, అస్వస్థత వల్ల మంచంపై ఉన్నవారికి, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇంటి వద్దే డీలర్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ దుకాణంలో తప్పనిసరిగా ఈ-పోస్ డివైస్, వెయింగ్ మెషీన్ ఐరిస్ డివైస్ పనితీరు పరిశీలించి ఏదైనా రిపేర్లు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత టెక్నిషియన్‌తో వాటిని బాగుచేయించుకోవాలన్నారు. బియ్యం ఉచితంగా అందించడంతోపాటు పంచదార అంత్యోదయ కార్డు ఒక్కింటికి ఒక కిలో రూ.13.50 పైసలు చొప్పున, మిగిలిన కార్డులకు కార్డు ఒక్కింటికి అర కిలో రూ.17 చొప్పున పంపిణీ చేయనున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ డీలర్లు వ్యవహరిస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రాప్ హాలిడేకు ఆక్వా రైతులు సన్నద్ధం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జులై నుంచి ఆక్వా రైతులు క్రాప్ హాలిడే అమలుకు సిద్ధం కావాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. పూలపల్లిలోని ఆక్వా రైతుసంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సమావేశానికి పాలకొల్లు, నరసాపురం, ఆచంటకు చెందిన ఆక్వా రైతుసంఘ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులంతా జూన్ నెలాఖరుకు సాగు పట్టుబడులు పూర్తి చేసుకుని, జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పంట విరామం పాటించాలన్నారు. చలో అమరావతి కార్యక్రమానికి ప్రతిఒక్క ఆక్వారైతు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాసిరకమైన సీడ్‌ను కంపెనీలు సరఫరా చేయడం వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు బోనం చినబాబు, పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు, భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, బోనం రంగయ్యనాయుడు, దాట్ల సోమేశ్వరరావు, రుద్రరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రభుత్వ కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. సిద్ధాంతం శివారు ఘటాలదిబ్బ కాలనీని ఆయన శనివారం సందర్శించి అక్కడి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి సదుపాయాలు అరకొరగానే ఉన్నాయని, ఈ సౌకర్యాల కల్పనలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. వర్షం వస్తే కాలనీ మునిగిపోతుందని, గుంతల్లో నీటి నిల్వ వద్ద దోమలు పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయని తెలిపారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీవాసులతో కలిసి కొద్దిసేపు నిరసన తెలిపారు.

నినదిస్తున్న కాలనీవాసులు

అనుమానంతో సన్నిహితుని హత్య

ఇద్దరు ముద్దాయిల అరెస్టు

డిఎస్‌పి ఆర్‌జి.జయసూర్య

భీమవరం టౌన్ : తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు, దొంగతనం చేశాడు అన్న అనుమానంతో వై.కోటేశ్వరరావు(బాబీ) అనే బొమ్మల వ్యాపారి, ఆటో డ్రైవర్ తనకు సన్నిహితుడిగా ఉండే మరో ఆటో డ్రైవర్ కాటూరి దుర్గారావు(28)ను హత్య చేశాడని భీమవరం డిఎస్‌పి రావూరి గణేష్ జైసూర్య తెలిపారు. శనివారం భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో వన్ టౌన్ సిఐ నాగరాజు, ఎస్ఐ కృష్ణాజీతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాటూరి దుర్గారావు హత్యకు సంబంధించి వివరాలను తెలియజేశారు. భీమవరం మూడవ పట్టణం చినరంగనిపాలెంలో ఉండే మృతుడు దుర్గారావు ఈనెల నాలుగవ తేదీ నుంచి కనిపించకుండా పోయాడని తమకు లభించిన సమాచారం మేరకు కాటూరి దుర్గారావు సోదరుడు కాటూరి నాగరాజును పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. తన సోదరుడు దుర్గారావు అదృశ్యంకు సంబంధించి ఈనెల 21వ తేదీన వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడన్నారు. హత్యకు గురైన దుర్గారావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ ఉంటాడని, కొన్ని సంవత్సరాల క్రితం అతని భార్య దుర్గారావును విడిచిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి మృతుడు ఒంటరిగానే ఉంటున్నాడని డిఎస్‌పి తెలిపారు. ఈ మధ్యకాలంలో రెండు సంవత్సరాల క్రితం దుర్గారావుకు అదే ప్రాంతానికి చెందిన యల్లా కోటేశ్వరరావు(బాబి)తో పరిచయం ఏర్పడిందని, బాబి కూడా ఆటోడ్రైవర్ అని వివిధ సంతలు, తిరునాళ్లలో బొమ్మల వ్యాపారం చేస్తూ ఉంటాడన్నారు. కోటేశ్వరరావు కూడా తన మొదటి భార్య నుంచి విడిపోయాడని, అనంతరం షేక్ మేరీని వివాహం చేసుకున్నాడన్నారు. మొదటి భర్త వల్ల కలిగిన ఇద్దరు సంతానం మేరీకి ఉన్నారన్నారు. ఒక కుమారుడికి 17 సంవత్సరాలు, మరో కుమారుడికి 15 సంవత్సరాలని అయితే వారు తల్లితో, సవతి తండ్రితో కలిసి చినరంగనిపాలెంలో ఉంటున్నారని డిఎస్‌పి జైసూర్య తెలిపారు. ఈనెల 4వ తేదీన ఫిర్యాదుదారుడు నాగరాజు తన భార్యకు దశదినకర్మ జరుగుతున్న సందర్భంగా యల్లా కోటేశ్వరరావు, అతని కుమారుడు జాన్‌లు అక్కడికి వచ్చి దొంగతనం ఆరోపణలతో దుర్గారావును వారితో పాటు తీసుకెళ్లారన్నారు. దుర్గారావును తమ నివాసానికి తీసుకువెళ్లి అదే రోజు ముద్దాయిలు దుర్గారావుపై తీవ్రంగా దాడి చేశారన్నారు. దుర్గారావు కాళ్లు, చేతులు కట్టేసి నోటిలో గుడ్డలు పెట్టి, ఎరువుల సంచులతో కుట్టిన పెద్ద సంచిలో అతనిని ఉంచి 4వ తేది రాత్రి ఆటోలో దుర్గారావును ముద్దాయి సొంత ఊరైన రావులపాలెం సమీపంలోని వెదురేశ్వరం తీసుకు వెళుతూ మార్గ మధ్యలో దుర్గారావు చనిపోయి ఉంటాడని, అతనిని ఎక్కడో ఒకచోట పడవేద్దామని ముద్దాయిలు అనుకున్నారన్నారు. వెదిరేశ్వరం వద్దకు వెళ్లి ముద్దాయిలు దుర్గారావు చనిపోయాడో లేదో చూద్దామని ఆటోలో వెనుక ఉన్న సంచిని చూడగా దుర్గారావు చావకుండా ఇంకా కొట్టుకుంటూ శబ్దాలు చేస్తూ ఉన్నాడని, దీంతో ముద్దాయిలు అక్కడ ఆ సంచిని విప్పి దుర్గారావు నోటిలో గుడ్డలు బాగా కుక్కి అరవకుండా నోటికి తాడు కట్టి సంచి, మూతిని మరలా గట్టిగా బిగించి కట్టి ఆటో కేసి బలంగా సంచిని కొట్టారన్నారు. ఆ దెబ్బతో దుర్గారావు చనిపోయాడని దీంతో దుర్గారావు శవాన్ని ముద్దాయిలు వెదిరేశ్వరం తమ సొంత ఇంటికి తీసుకువెళ్లి అక్కడ శవాన్ని చిన్నగా వంచి తాడుతో కట్టి, ఇంకొక సంచిలో మూటగట్టి శవాన్ని మొదటి ముద్దాయి కోటేశ్వరరావు, మూడో ముద్దాయి అతని కొడుకు మోటార్ సైకిల్‌పై జొన్నాడ గ్రామంలోని కోటిపల్లి కాలువ వద్దకు తీసుకువెళ్లి అక్కడ ఉదయ్ డన్ రిసార్ట్స్ దగ్గరలో శవాన్ని మూటతో సహా కోటిపల్లి కాలవలో పడవేసి ఇంటికి వచ్చేసారన్నారు. తాము మృతదేహాన్ని గుర్తించి మృతదేహం దొరికిన ప్రదేశంలోనే పంచనామా, పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ప్రథమ ముద్దాయి యల్లా కోటేశ్వరరావు అలాగే హత్యతో ప్రమేయం ఉందని భావించిన షేక్ మేరీని అరెస్టు చేసామన్నారు. మూడవ ముద్దాయి మైనర్ కావడంతో దానికి సంబంధించి విచారణ చేస్తున్నామని డిఎస్‌పి జయ సూర్య తెలియజేశారు. హత్యకు వినియోగించిన రాడ్‌ను, సుత్తిని, సంచిని, మృతుడి సెల్ ఫోన్‌ను ఈ సందర్భంగా ప్రెస్ మీట్‌లో ప్రదర్శించారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అత్తిలి

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా అత్తిలిలో ఉపాధి కూలీలను కలిసి కొద్దిసేపు మాట్లాడారు. రెండు మాసాలుగా చేసిన పనికి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని కూలీలు చెప్పారు. రెండు ఫొటోలు మస్టర్ విధానం వల్ల, ఉదయం ఆరు గంటలకు కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లి పని చేయడం ఒక ఎత్తయితే, పని చేసిన తర్వాత రెండో మస్టర్ ఫొటో కోసం 11 గంటల వరకు ఎండలో వేచి చూడటం మరో ఎత్తని అన్నారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వర్యం చేయాలనే కుట్రలో భాగంగానే ప్రభుత్వాలు ఇటువంటి దుర్మార్గ విధానాలు తీసుకొచ్చి ఉపాధి హామీ నుండి కూలీలను దూరం చేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు కూలీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, కూలీలకు ఇబ్బందిగా ఉన్న ఎన్‌ఎంఎంఎస్ యాప్ తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌరు చంద్రకళ, వీరవల్లి విజయలక్ష్మి, గుత్తుల హేమ, బొక్కా వరలక్ష్మి, కాండ్రేగుల ఉమామహేశ్వరి, బొంతు శ్రీను, చేబ్రోలు వెంకటలక్ష్మి, బొంతు సీతారత్నం, మట్టపర్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాటలు సరే.. చేతలేవీ..!

గోదారి గలగలలు

తాము రైతులకు అండదండగా ఉంటామని, తమది రైతు పక్షపాత ప్రభుత్వమని పాలకులు అధికారంలోకి రాగానే చెప్పుకోవడం సర్వసాధారణమైంది. మాటల్లో ముందుండే పాలకులు కీలక సమయంలో రైతుల పక్షంగా చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారనేది వరి రైతుల నుంచి ఆక్వా, పామాయిల్, తాజాగా కోకో రైతుల వరకూ అందరి విషయంలోనూ స్పష్టమవుతోంది. ఏలూరు కలెక్టరేట్ వేదికగా మంత్రులు కోకో ధరపై చర్చలకు పిలిచినా కనీసం కంపెనీ ప్రతినిధులు సైతం హాజరు కాకపోవడం వారి ఇష్టారాజ్యం, దోపిడీ విధానాన్ని ప్రతిబింబిస్తుందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ప్రకారం ఇక్కడ కోకో ధర నిర్ణయించి అమలు చేయాలని రైతుల ఆందోళన నేపథ్యంలో ఏలూరు కలెక్టరేట్‌లో మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి ఇటు రైతులు, ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. అసలు కంపెనీల ప్రతినిధులే చర్చలకు ముఖం చాటేయగా, హాజరైన ట్రేడర్లు తమ చేతుల్లో ఏమీ లేదని, కంపెనీలు ఇచ్చే ధర ప్రకారమే కొనుగోలు చేస్తామని చెప్పడంతో మంత్రులు సైతం అవాక్కయ్యారు. ఇక గత్యంతరం లేక కంపెనీల ప్రతినిధులను ఆన్‌లైన్‌లోకి పిలిచి మాట్లాడారు. అయితే కంపెనీ ప్రతినిధులు తాము ఎందుకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వడం లేదనే దానికి సమాధానం చెప్పకుండా, తాము ఎట్టి పరిస్థితుల్లోనూ కిలో కోకో గింజలు రూ.450కు మించి కొనుగోలు చేయలేమని స్పష్టం చేశారు. దీంతో మంత్రులే బతిమలాడి తాము రూ.50 చొప్పున ఇస్తామని, అందువల్ల రైతుల వద్ద కిలో ధర రూ.500కు కొనుగోలు చేయాలని చెప్పి చర్చలు ముగించేశారు. కానీ వాస్తవంగా అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర రూ.800కుపైనే ఉంది. కనీసంగా రూ.700 వరకైనా ధర వస్తేగాని రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. మరి మంత్రులు సైతం రూ.500 ధర ఎలా నిర్ణయించారో వారికే తెలియాలి. కనీసం అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం ఇక్కడ ధర ఎందుకు చెల్లించడం లేదనే దానికి ఎవరి నుంచీ సమాధానం రాని పరిస్థితి. దీంతో కోకో రైతుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి చందంగా తయారైంది. ఇదే తరహాలో వరి రైతులు ధాన్యం అమ్మకం సమయంలో మిల్లర్లకు సొమ్ము చెల్లించడంగాని, లేదా అదనంగా ధాన్యం తూయాల్సిన పరిస్థితులు ఎదురైన సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఆక్వా రైతులు సైతం ఫీడ్, సీడ్ ధరలు పెరగడం, నాణ్యతా ప్రమాణాలు లోపంతో పాటు ధర రాక తీవ్ర నష్టాలు పాలవుతున్నామని ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై సీడ్, ఫీడ్ ధరలు తగ్గించేటట్లు చర్యలు తీసుకుంటామని హడావుడి చేసిన పాలకులు, అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోయారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ క్రమంలో ఆక్వా రైతులు పాలకొల్లు ప్రాంతంలో క్రాప్ హాలిడేకు సిద్ధమయ్యారు. జులై నుంచి సాగుకు విరామం ప్రకటించాలని నాలుగు మండలాల రైతులు సన్నద్ధమవుతున్నారు. అంటే జిల్లాలోని వివిధ పంటల రైతులు ఆందోళన బాట పడుతున్నారనేది స్పష్టమవుతోంది. ఈ ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం రైతుల పక్షపాతిగా చర్యలు చేపడుతుందా, లేక తూతూమంత్రపు చర్యలతో రైతు వ్యతిరేక ప్రభుత్వంగా నిలుస్తుందా అనేది వేచిచూడాలి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

సాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు

ప్రజాశక్తి - వీరవాసరం

సార్వా సీజన్‌లో సాగునీటికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని వీరవాసరం సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఆకుల లీలాకృష్ణమూర్తి తెలిపారు. వీరవాసరం, మత్స్యపురి సాగునీటి సంఘాల సమావేశం స్థానిక రైతుభరోసా కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలా కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటితీరువాను వసూలు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల నిధుల కొరత ఏర్పడిందన్నారు. వచ్చే సంవత్సరం కాలువల ఆధునికీకరణ చేపడతారన్నారు. పెర్కిపాలెం నుండి వీరవాసరం మూడో డ్యామ్ వరకు పశ్చిమ కాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సాగుకు ఇబ్బంది లేకుండా మురుగు కాల్వలను ప్రక్షాళన చేస్తున్నట్లు జెఇ వేంద్ర రమణ తెలిపారు. అనంతరం మెంటేపూడి వద్ద డ్యామ్‌ను పరిశీలించారు. డ్యామ్ వద్ద పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని లీలాకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణ, వీరవాసరం నీటి సంఘం అధ్యక్షులు గౌరెడ్డి చిన్నారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న డిసి అధ్యక్షులు, ఇతరులు

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు పేద కుటుంబాలకు ఆర్థికసాయం చేయడానికి ముందుకొచ్చారు. కాళ్లకూరు గ్రామం పాత పేటకు చెందిన దొడ్డి యశోదరావు తల్లి అన్నమ్మ అనారోగ్యం కారణంగా మృతిచెందారు. దాసరిపేటకు చెందిన దూబ దండు అనారోగ్యం కారణంగా మరణించారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ముందుకొచ్చి మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు శనివారం అందజేశారు.

గోడ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రైతు బిడ్డగా రైతుల మేలు కోరేది మంత్రి నిమ్మల రామానాయుడు అని టిడిపి మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామంలో కాలవ వెంబడి రూ.కోటి 65 లక్షలతో నిర్మిస్తున్న కాంక్రీట్ గోడ నిర్మాణ పనులను టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సుమారు 100 కోట్లతో కాలవల తవ్వకం, గ్రావెల్ రహదారి నిర్మాణాలు, కాంక్రీట్ గోడ పనులు వంటివి జరుగుతున్నాయని చెప్పారు. ఈ పనులు మంత్రి రామానాయుడు ఆదేశాలతో జరుగుతున్నాయని, ఇందుకు రైతులంతా రుణపడి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాముల రజనీకుమార్, దొడ్డ ఏడుకొండలు, సాగర్ సత్యనారాయణ, పాసర్ల శ్రీను, సింహాచలం, వెంకటరమణ, మల్ల సాంబ, మడ్డు సత్యనారాయణ పాల్గొన్నారు.

మూగజీవాల చికిత్సకు వైద్యులను నియమించండి

గోరక్ష సేవాసమితి ఆధ్వర్యాన ఎంఎల్ఎ అంజిబాబుకు వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మూగజీవాలు అనేక కారణాలవల్ల గాయాలపాలై అనేక ఇబ్బందులు పడుతున్నాయని వాటికి చికిత్స అందించేందుకు పశువైద్య అధికారులు సకాలంలో స్పందించడం లేదని, దీనిపై ప్రత్యేకంగా డాక్టర్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గోరక్ష సేవా సమితి అధ్యక్షులు సుంకరదాసు ఎంఎల్ఎ అంజిబాబును కోరారు. శనివారం ఎంఎల్ఎకి వినతిపత్రం అందజేశారు. మూగజీవాల యజమానులు వాటిని పట్టించుకోకుండా రోడ్లపై వదిలేయడంతో వాహన ప్రమాదాల్లో గాయాలు కావడంతో నరకం అనుభవిస్తున్నాయని, ఆ సమయంలో వాటికి చికిత్స అందించేందుకు డాక్టర్స్‌కు ఫోన్ చేసినప్పటికీ వారు స్పందించట్లేదని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు.

లలిత కళలతోనే సామాజిక చైతన్యం

సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించుకోవాలని, లలిత కళలతోనే సామాజిక చైతన్యమని సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చేగొండి సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో కళా సంస్థలు, సంగీత, సాహిత్య, కవిత, ఆధ్యాత్మిక రంగాల వారి సమక్షంలో శనివారం సంస్కార భారతి జిల్లాశాఖను ప్రారంభించి, సంస్కార భారతి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 1981లో ఆగ్రా కేంద్రంగా ప్రారంభమైన సంస్కార భారతి గత నాలుగు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా వందలాది శాఖలతో విస్తరించిందన్నారు. లలిత కళల ద్వారా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న భారతీయ సేవా సంస్థ సంస్కార భారతి అని అన్నారు. గన్నాబత్తుల శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి, ఆరేటి ప్రకాష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు కళల ద్వారా తెలియజెప్పాలని సంస్కార భారతి చేస్తున్న ప్రక్రియ అని అన్నారు. భీమవరంలో అన్ని రంగాల వారితో ఒక సంస్కార భారతి శాఖను ఏర్పాటు చేస్తామని తెలిపారు. భీమవరంలో త్వరలో అన్ని పాఠశాల, కళాశాలల్లో సంస్కార భారతి యూనిట్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాంజీ, యర్రంశెట్టి వెంకటరత్నం, టివివి.ప్రసాద్, జవ్వాది శ్రీనివాస్, రచయిత తెన్నేటి లక్ష్మి నారాయణమూర్తి, కలిగొట్ల గోపాలశర్మ, సంగీత విద్వాంసులు పిప్పళ్ల ప్రసాద్, కాగిత వెంకటరమణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, ఎస్‌కె చాన్ భాషా, రాము, రాజబాబు పాల్గొన్నారు.

పశువైద్యశాల నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పెనుగొండ

పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. నడిపూడి గ్రామంలో రూ.26.50 లక్షల నాబార్డు నిధులతో నిర్మించబడిన పశువైద్యశాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో పాడిరైతులు పశువుల పెంపకం తగ్గిందని వీటిని అధిగమించడానికి ప్రభుత్వం పాడిపశువులు పెంచడానికి సబ్సిడీ రుణాలు ఇస్తుందని, దీనిని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్, గ్రామ సర్పంచి కడలి బేబీ అన్నపూర్ణ, నాయకులు వెలిచెట్టి బాబు రాజేంద్రప్రసాద్, పశు వైద్యాధికారులు సుధాకర్ రాణి, తేజ, నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చల్లా సుదర్శన వెంకటరెడ్డి

ప్రజాశక్తి - ఉండి

యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంత జీవనాన్ని కొనసాగించవచ్చని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చల్లా సుదర్శన వెంకటరెడ్డి అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. యోగ వల్ల ప్రశాంత జీవనం కలుగుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - ఉండి

తణుకులో నిర్వహిస్తున్న జిల్లా మినీ మహానాడుకు ఉండి నుంచి టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, డిసి పైన్ ఛైర్మన్ మంతెన సాయి లక్ష్మణ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవ ప్రధానం నందమూరి తారక రామారావు టిడిపిని స్థాపించడం జరిగిందని, ప్రతి సంవత్సరం ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా మహానాడు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మినీ మహానాడుకు వెళ్లిన వారిలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, గొర్లి బాబి, ముగ్గళ్ల సత్యనారాయణ, యేసొబు కృష్ణ ఉన్నారు.

పాలకొల్లు : తణుకులో శనివారం జరిగే జిల్లా మహానాడులో పాల్గొనటానికి పాలకొల్లు నుండి భారీ ర్యాలీగా నేతలు, కార్యకర్తలు తరలి వెళ్లారు. 50కి పైగా కార్లతో ర్యాలీగా బయలుదేరారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు ర్యాలీకి నాయకత్వం వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తలకు గాయాలు

మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలింపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు-నెగ్గిపూడి హెచ్‌పి బంకు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన పులగం సత్యనారాయణ రెడ్డి(48) సాయంత్రం రొయ్యల చెరువు వద్దకు వెళ్లి అర్ధరాత్రి సుమారు 12:30 ప్రాంతంలో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్టేరులోని హెచ్‌పి సమీపంలో కల్వర్ట్ నిర్మాణం పనుల నిమిత్తం బారికేడ్లను అడ్డంగా ఉంచగా నిర్లక్ష్యంగా బారికేడ్ల వద్ద ఏ విధమైన జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో బారికేడ్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళుతున్న ఇద్దరు యువకులు గమనించి పెనుమంట్ర 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ పైలెట్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మెడికల్ టెక్నీషియన్ బాలకృష్ణ క్షతగాత్రున్ని పరిశీలించగా తలకు తీవ్ర గాయమై చెవుల నుంచి రక్తం కారి అపస్మారక స్థితిలో ఉండటంతో పైలెట్ శ్రీనివాసరావు సహకారంతో వాహనంలోకి ఎక్కించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో అక్కడినుండి భీమవరం ప్రయివేట్ ఆస్పత్రికి, మరలా అక్కడ నుండి ప్రయివేట్ వాహనం ద్వారా విజయవాడ ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించినట్లు సమాచారం.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మద్యం మాని ఆరోగ్యంగా ఉండండి

ఎక్సైజ్ సిఐ కె.బలరామరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఒక్క పెగ్గుతో మొదలై బాటిల్ ముగిసే వరకు వదలని జబ్బు మద్యం అలవాటని, మద్యం అలవాటు మీ ఆయుష్షును తినేస్తుందని ఎక్సైజ్ సిఐ కె.బలరామరాజు అన్నారు. శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం పాత బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ సభ్యులతో మద్యం మానండి-ఆరోగ్యంగా ఉండండి అంటూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ బలరామరాజు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే మందుకు దూరంగా ఉండాలన్నారు. పాత బస్టాండ్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏసుబాబు, పోతుల పెద్దిరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విందులు, వినోదాల పేరుతో యువత అతిగా మద్యం సేవించడం ఇటీవలే ఎక్కువైయిందని, ఇది గుండెకు చాలా హాని చేస్తుందని అన్నారు. మద్యం మానండి ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు నరసింహారావు, యముడు, కోటేశ్వరరావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిళల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - తణుకు

పనిచేసే చోట మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లయితే మహిళలు సమస్యను ధైర్యంగా ఎదిరించి, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచించారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సులో మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లయితే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ సమస్య ఎదురైనప్పుడు మహిళలు ఖండించాలని తెలిపారు. అంతర్జాతీయ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా పిల్లలు కనిపించకపోయినా, తప్పిపోయిన వెంటనే పోలీసు లేదా 1098 చైల్డ్ లైన్‌కు తెలియపర్చాలని కోరారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా పిల్లల విషయంలో ఉండాలని, సమస్యలు ఏమి ఉన్నా మండల న్యాయ సేవల కమిటీ తణుకు వారి ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్, సిడిపిఒ ప్రమోదినికుమారి, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, పోణంగి శ్రావణిసమీరా, ఐ.కృష్ణవేణి, బంధకవి నారాయణ, పైడి ధనుంజయ్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయడమే తన వంతు ధర్మమని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మారిశెట్టి ఫంక్షన్ హాల్‌లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.కోటి 38 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్‌ను నియోజకవర్గపరిధిలోని 59 మంది బాధితులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి చేస్తున్న సంక్షేమాలను ప్రజలు గుర్తించి ఏది మంచి ప్రభుత్వమో ప్రజలే నిర్ణయించాలని అన్నారు. నియోజకవర్గంలో తనను గెలిపించిన ప్రజల సమస్యలను వేగవంతంగా తీర్చేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నానని చెప్పారు. గడచిన 12 నెలలుగా కోట్ల రూపాయల వ్యయంతో రహదారుల నిర్మాణం, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, నియోజకవర్గ దాతల విరాళాల సహకారంతో హై స్కూల్ అభివృద్ధి పనులు, క్రికెట్ స్టేడియం నిర్మాణం, ఓపెన్ ఆడిటోరియం వంటి అనేక అభివృద్ధి పనులు జరగనున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అభివృద్ధి పనులను కూటమి నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రతి పౌరునికి చేరే విధంగా సమాచారాన్ని అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎల్.అగ్రహారం టిడ్కో గృహాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎపి, ఇపిడిసిఎల్) నరసింహమూర్తి, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, ఎల్అండ్‌టి ప్రాజెక్టు మేనేజర్‌తో పాటు పరిశీలించారు. అక్కడ నివాసితులతో వాళ్ల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడ్కో లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే ప్రజల సహాయ సహకారాలు ఉంటాయో అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆ ప్రాంతం అభివృద్ధికి నోచుకుంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, తద్వారా పారిశుధ్య పరిశుభ్రత లేకపోవడం, కరెంటు సదుపాయాలు లేకపోవడం, నిర్ణీత సమయంలో గృహాలను అందించకపోవడం వంటి తప్పిదాలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో అటువంటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మూడు, నాలుగు ఫ్లోర్‌లకు వెళ్లేందుకు అనువుగా లిఫ్ట్‌లను ఏర్పాటుచేసి అనువైన విధానంను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, తొందరలోనే ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, ఎల్అండ్‌టి ప్రాజెక్ట్ మేనేజర్, ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మధుర్‌కు చెక్కును అందిస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్

మధుర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన వెలిగట్ల శ్రీవెంకట నాగ మధుర్ త్వరలో భారత్-నేపాల్ మధ్య జరిగే టి-20 సిరీస్‌కు ఎంపికయ్యాడు. విశాఖకు చెందిన నైన్ ఏసైడ్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన రంజీల్లో మధుర్ ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో పలువురు క్రీడాకారులు, దాతలు మధుర్‌కు ఆర్థికంగా అండగా నిలుస్తూ వస్తున్నారు. ఇప్పటికే జైన్ యూత్ అసోసియేషన్ కొంత మొత్తాన్ని ప్రకటించింది. తాజాగా మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త పోలిశెట్టి శ్రీనివాస్ రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఆయన నివాసంలో మధుర్‌ను ఘనంగా సత్కరించారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పూలపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా పనిచేస్తున్న ఉపాధి శ్రామికులకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు వేగేశ్న శ్రీహరి రాజు, జనసేన అధ్యక్షులు నూకల శ్రీను, నాయకులు జి.గోనేటి రామకృష్ణ, పాలపర్తి చాంద్ రాజు, నున్నబోయిన నాగరాజు, గుబ్బల ప్రసాద్, గుడిసె సురేంద్ర పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించరూ..!

కొద్దిపాటి వర్షానికి నీట మునిగిన పెద్దపేట కాలనీ
ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆచంట

దీర్ఘకాలంగా ఆచంట పెద్దపేట డ్రెయినేజీ సమస్య పట్టిపీడిస్తోంది. ఏళ్లతరబడి సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలోనే ఈ సమస్య ఉందంటే పొరపాటు పడినట్లే. ఇటీవల కురిసిన వర్షాలకు వేసవికాలంలో కూడా కొద్దిపాటి వర్షానికి ఆచంట పెద్దపేట గ్రామం నీట మునిగి దర్శనమిస్తుంది. దీంతో ఆ గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీరు రహదారిపై నిలిచిపోయి, దోమలు విపరీతంగా పెరిగి తరచూ జబ్బుల బారిన పడుతున్నామని పెద్ద పేట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో నిత్యం ఇక్కడ ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 11వ వార్డుకు నిధులు మంజూరు చేసి సిమెంట్ రోడ్డును నిర్మించి, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆ గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పెద్దపేటలో నీట మునిగిన రహదారి

ఉప సర్పంచి పదవికి మైలా రాజీనామా

ప్రజాశక్తి - కాళ్ల

లక్ష్మీ నరసింహపురం(ఎల్ఎన్ పురం) గ్రామ పంచాయతీలో సర్పంచి నియంతృత్వ ధోరణితో కలత చెంది ఉప సర్పంచి పదవికి రాజీనామా చేస్తున్నట్లు 6వ వార్డు ఉప సర్పంచి మైలా శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.స్వాతిని కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పదవి చేపట్టిన నాటి నుంచి పేదప్రజలకు నిస్వార్థంగా సేవలందించానన్నారు. ఇటీవల మారిన రాజకీయ పరిస్థితులను బట్టి సర్పంచి, కొంతమంది వార్డు సభ్యులు వారి ఆస్తులను కాపాడుకోవడానికి వైసిపిని వీడి టిడిపిలోకి చేరారన్నారు. టిడిపిలోకి రావాలని నన్ను ఒత్తిడి చేశారన్నారు. వైసిపిలోనే ఉంటాను అనడంతో నాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారన్నారు. జరుగుతున్న రాజకీయ పరిణామాలకు విసుగుచెంది ఉప సర్పంచి పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

నాణ్యమైన విద్యుత్తును అందించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఆచంట పట్టణంలోని రామేశ్వరస్వామి దేవస్థానం, మదన గోపాలస్వామి దేవస్థానం సమీపంలో రూ.12 లక్షలతో ఏర్పాటుచేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా చేయాలనే లక్ష్యంతో విద్యుత్ సమస్యను అధిగమించడానికి రూ.12 లక్షలతో 100 కెవి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవిలో ఎసిలు, కూలర్ల ద్వారా అధిక విద్యుత్ వినియోగిస్తున్నారని, దీంతో తరచుగా విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పెనుగొండ నుంచి ఆచంటకు కొత్తగా 33 కెవి లైన్ పనులు జరుగుతున్నాయని, దీంతో కొంతమేర విద్యుత్తుకు ఆటంకం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ డి.రామకృష్ణ, ఇన్‌ఛార్జి ఎం.రామారావు, పార్టీ మండల అధ్యక్షులు కేతా వీరయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు నెక్కంటి ప్రభాకర్ రావు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, తమ్మినీడి ప్రసాద్, బీర నరసింహమూర్తి, కేతా మురళీ, సీతారాం పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ పితాని

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

జిల్లా మలేరియా డాక్టర్ క్రాంతి

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ క్రాంతి, కృష్ణదుర్గ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండి, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా డాక్టర్ క్రాంతి, డాక్టర్ ఎస్.కృష్ణదుర్గ, జిల్లా ఎపిడిమాలాజిస్ట్ సుభాష్ అన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా స్థానిక 31వ వార్డులోని బలిసిముడి ప్రాంతంలో రోగాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతంలో బ్యానర్‌తో అవగాహనా ర్యాలీ నిర్వహించి, ప్రజలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలలో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యంగా ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరిబొండాల్లో, టైర్లు, వాడి పడేసిన ప్లాస్టిక్ డబ్బాలలో నీరు నిలవవుండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో రోగాల బారినపడే ప్రమాదం ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎ.లలిత కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ్‌కుమార్‌కు డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. లవ్ పీపుల్ ఫౌండేషన్ అనే సేవా సంస్థను స్థాపించి గత 14 సంవత్సరాలుగా నిర్విరామంగా సేవా కార్యక్రమాలు చేస్తూ తన సంపాదనలో 50 శాతం సేవకే ఖర్చు చేస్తూ, తాను సేవ చేయడమే కాకుండా అనేకమందిని సేవా కార్యక్రమాల వైపు మళ్లిస్తూ, యువతను చైతన్యవంతుల్ని చేస్తూ యువ సామాజిక వేత్తగా పేరు పొందిన ప్రేమ్ కుమార్ రచయితగా, దళిత అభ్యుదయవాదిగా, రాజకీయవేత్తగా కూడా కొనసాగుతున్నాడు. అడవి బిడ్డలకు, అనాదలకు వస్త్రాలు, దుప్పట్లు పంచడమే కాకుండా, రోడ్డు పక్కన ఉండే అభాగ్యులకు పెళ్లిళ్లు, ఫంక్షన్‌లలో మిగిలిన ఆహారాన్ని తెచ్చి తన టీమ్ సభ్యులతో కలసి పంచుతున్నాడు. తమ సంస్థలో చేరిన వారి పుట్టినరోజులు, పెళ్లి రోజులు, పేదల మధ్యలో జరుపుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 'గుప్పెడు బియ్యం సాటి వారికి సాయం' అనే వినూత్న కార్యక్రమం ప్రారంభించి ప్రతి నెల ఒక నిరుపేద కుటుంబాన్ని టీమ్ సహకారంతో గుర్తించి ఆ కుటుంబానికి బియ్యం, కిరణా సరుకులు, కూరగాయలు అందిస్తున్నాడు. అత్యవసర పరిస్థితులలో ఉన్న రోగులకు రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తున్నాడు. రాజ్యాంగ విలువలు, చదువు ప్రాముఖ్యత వంటి అంశాలపై వివిధ ప్రాంతాలలో సెమినార్స్ నిర్వహిస్తూ, వివిధ రంగాలలో ప్రతిభ కనపరుస్తున్న వారిని సత్కరిస్తున్నాడు. వీటితో పాటు లవ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల పేర్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. తన 14 ఏళ్ల నిర్విరామ విశిష్ట సేవలను గుర్తించిన కేరళా కంకారిడియా యూనివర్సిటీ ఉన్నమట్ల ప్రేమ్ కుమాం ను సామాజిక వేత్తగా గుర్తిస్తూ సేవా రంగంలో గౌరవ డాక్టరెట్‌ను ప్రకటించింది. కేరళలో జరగాల్సిన కార్యక్రమం ఆగడంతో తణుకులో ఆ గౌరవాన్ని ప్రేమ్ కుమార్ అందుకున్నారు. పలువురు రాజకీయ నాయకులు, బహుజన రచయితలు, హర్షం వ్యక్తం చేశారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కె.ప్రభు కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏలూరు కెవి.నాగప్రభుకుమార్ అన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బి.శ్రీలత ఆదేశాల మేరకు శనివారం స్థానిక దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న దీక్ష డి-అడిక్షన్ అండ్ డ్రగ్ రీహాబిలిటేషన్ సెంటర్‌లో కేర్ ఆధ్వర్యంలో మద్యపాన, మత్తు పదార్థాల వ్యసనం-వ్యసన విముక్తికు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏలూరు కెవి.నాగ ప్రభుకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యసన విముక్తికు ప్రజలందరూ సహకరించి ఆరోగ్యంగా ఉండాలని, ముఖ్యంగా యువకులు దేశ ప్రగతికి పాటుపడాలన్నారు. అటువంటి యువకులు, కష్టపడి జీవించే శ్రామికులు, ప్రజలందరూ వ్యసనాలకు దూరంగా ఉండి ఆనందమైన జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, జిల్లా డాక్టర్ ఆర్ఎస్ కుమరేశ్వరన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి యువశక్తి నిర్వీర్యం కాకుండా ఉండాలని, సమాజ హితం కోసం స్వచ్ఛందంగా సేవ చేస్తున్న దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న దీక్ష డి అడిక్షన్ అండ్ డ్రగ్ రీహాబిలిటేషన్ సెంటర్ వారి సేవలను అభినందించారు. వ్యసనాలకు అలవాటు పడే వారిని గుర్తించి ఈ వ్యసన విముక్త కేంద్రంలో చేర్పించాల్సిన ఆవశ్యకతను సిబ్బందికి తెలియజేస్తూ దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ, తాడేపల్లిగూడెం వారికి రూ.10 వేల నగదు అందించి, ఈ సంస్థకు అన్ని రకాల తోడ్పాటును స్థానిక ఎక్సైజ్ సిబ్బంది అందించవలసిందిగా ఆదేశించారు. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా ఆర్‌వి.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఇటువంటి సంస్థలకు అందరూ సహాయ సహకారాలు అందించవలసిన అవసరం ఉందని, మెరుగైన సమాజం కోసం ఉద్యోగులు, ప్రజలు కలిసికట్టుగా కృషిచేయాలని సూచించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న దీక్ష డి - అడిక్షన్ అండ్ డ్రగ్ రీహాబిలిటేషన్ సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమని, ఏవిధమైన ఫీజు లేకుండా ఉచితంగా సేవలందించటం గొప్ప విషయమని అన్నారు. దీక్ష డి-అడిక్షన్ అండ్ డ్రగ్ రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారికి పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు జి.మురళీమోహన్‌రావు, ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో పాల్గొన్న విద్యార్థుల చేత పుస్తక పఠనం, కథలు చదివించడం, చెప్పడం జరిగింది. ప్రముఖ నేత్ర వైద్యులు విజయలక్ష్మి కంటి ఆసుపత్రి డాక్టర్ దువ్వూరి సాంబమూర్తి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని పిల్లలకు కంటిచూపు గురించి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అని కంటి నిర్మాణం, మైగ్రేన్ తలనొప్పి, రేచీకటి, హ్రస్వ దృష్టి, దూర దృష్టి గురించి కంప్యూటర్ ద్వారా పిల్లలకు వివరించారు. సెల్‌ఫోన్ తక్కువగా ఉపయోగించాలి, ఆహారపు అలవాట్లు, విటమిన్ ఎ ఉన్నటువంటి పండ్లు, కాయగూరలు మొదలైనవి తీసుకొనుట ద్వారా, వ్యాయామం చేయాలని కొన్ని జాగ్రత్తలు తెలియజేశారు. పిల్లలు అడిగిన సందేహాలకు మంచి సలహాలు ఇచ్చారు. తదనంతరం క్విజ్ పోటీ జరిగింది. క్విజ్ మాస్టర్ సుధీర్ మోహన్ పిల్లలకు మంచి మంచి ప్రశ్నలు వేసి, చిత్రాలను చూపించి చాలా ఉత్సాహంగా క్విజ్ నిర్వహించారు. క్యారమ్స్ కూడా ఆడించారు. కార్యక్రమంలో క్విజ్ స్కోరర్ డాక్టర్ అమ్మాజీ, రిటైర్డ్ ప్రిన్సిపల్ సూర్యంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు. విజేతలకు జూన్ ఆరో తేదీ ముగింపు సభలో బహుమతులు ఇవ్వబడతాయని గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు.

తాడేపల్లిగూడెం : పట్టణ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఆసక్తికరంగా జరుగుతున్నట్లు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. రిసోర్స్ పర్సన్ ప్రత్తి వీరాస్వామి విద్యార్థులకు కథల పుస్తకాలను చదివించడం, సైన్స్ పాఠాలను వివరించారు. ఎ.జనార్ధన్‌రావు విద్యార్థులకు పొడుపు కథలు, డ్రాయింగ్ నేర్పించారు. గరికపాటి బాపయ్య శర్మ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ బోధించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ పట్నంలోని విద్యార్థులందరూ ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం 26వ రోజు కార్యక్రమాలు జరిగాయి. రిటైర్డ్ టీచర్ పి.సువర్ణ గౌరి పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ గ్రామర్ చెప్పగా గ్రంథాలయ మాస్టర్ పిటి శివకూమర్ పిల్లలచేత ఉయ్ లవ్ రీడింగ్ ప్రోగ్రాం కింద గ్రంథాలయంలో కథలు, భక్తి, పుస్తకాలు, చదవడం, రాయడం నేర్పారు. ఈ విజ్ఞాన శిబిరంలో కె.సత్యనారాయణ, వి.రవి, ఎం.మూర్తి, ఎస్.జశ్వంతి, కె.కార్తికేయ, బి.హసిని, కె.భవ్య శ్రీసాయిలక్ష్మీ, జి.నాగ కార్తిక్ రెడ్డి, జి.ప్రవిణ్ రెడ్డి, వై.కృష్ణ పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి రిజిస్ట్రేషన్ చేయించాలి : జెసి

భీమవరం : జూన్ 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున రిజిస్టర్ కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. యోగా దినోత్సవంలో జిల్లా ప్రజలందరి భాగస్వామ్యం పెద్ద ఎత్తున కావాలన్నారు. ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ లేదా వెబ్ ద్వారా నమోదు కావాలని సూచించారు. నమోదు చేసుకున్న వారు ఏ కారణం చేతనైనా యోగారోజు పాల్గొనకపోతే ఇబ్బంది లేదన్నారు.

వైసిపి అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా చెరుకువాడ శ్రీరంగనాథ రాజు

ఆచంట : వైసిపికి పూర్వవైభవం తీసుకురావడానికి తన వంతు కృషిచేస్తానని వైసిపి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం పోడూరు మండలం తూర్పు పాలెం వైసిపి అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన సందర్భంగా వైసిపి కార్యాలయంలో రంగనాథరాజును వైసిపి కార్యకర్తలు ఘనంగా సన్మానించి సత్కరించారు.

26 నుంచి రైల్వే గేటు మూసివేత

ఉండి : ఉండి వాంద్రం రహదారిలోని 109వ సిగ్నల్ రైల్వేగేటు ఈనెల 26వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 28వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు రైల్వే గేటు మూసి వేయడం జరుగుతుందని రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు తమకు సహకరించాలని కోరారు.

అన్నసమారాధనలో యాత్రికులు

నరసాపురం: మండలంలోని వేములదీవి పడమర కాపులకొడపలో వేంచేసివున్న వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి వైభవంగా సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన నరసాపురం వాసవి క్లబ్ కోశాధికారి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు కోట్ల బాలకృష్ణ, అరుణకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం కనకదుర్గ బీచ్‌లో ఉన్న మత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నసమరాధన చేశారు. యాత్రికులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో యాత్రికులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం, జువ్వలపాలెం కాపురస్తులు బాలం నాగేశ్వరరావు గారి కుమారుడు బాలం నాగరాజు అను నేను ది. 19-05-2025వ తేదీన జువ్వలపాలెం నుండి బ్యాంక్ పని నిమిత్తం తణుకు వెళ్ళుచుండగా దువ్వ తేతలి మధ్యలో నా ఒరిజినల్, లింక్ దస్తావేజులు, **D.No. 3974/2007** మరియు **D.No. 5816/2011** తాడేపల్లిగూడెం SRO లో రిజిష్టర్ కాబడినవి. పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల నా నెంబరుకు గాని నా క్లయింటు నెంబరుకు **83096 90092** తెలియపరచిన తగిన పారితోషకము యివ్వబడును.

తోట వెంకట సత్యనారాయణ
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం
24-05-2025
సెల్: 99482 43686